## గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో కే రాము

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని డీఈవో కే రాము అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్‌లో 14 నుంచి 17ఏళ్ల క్రీడాకారులకు 67వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో రాము హాజరై మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్టలను తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని 12మండలాల నుంచి క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను డీఈవో పరిచయం చేసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పోగుల నరేందర్, మండలాల కన్వీనర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

## పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

బచ్చన్నపేట, డిసెంబర్ 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం నాగేశ్వర్‌రావు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఆలీంపూర్, చిన్నరామన్‌చర్లలో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీఎంతోపాటు చిన్నరామన్‌చర్ల సర్పంచ్ ఖలీల్‌బేగం, ఆలీంపూర్ ఎంపీటీసీ మసూద్, పంచాయతీ కార్యదర్శి రేవతిగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు నర్సిరెడ్డి, సీఎస్‌సీ ప్రతినిధి సందెల కవిత, సీసీలు సత్యనారాయణ, నర్సింహులు, విజయలక్ష్మి, వీవోఏలు కవిత, లలిత, ఏఎన్‌ఎంలు రజిత, సంపూర్ణ, ఆశవర్కర్లు ప్రమీల, స్వప్న పాల్గొన్నారు. ఏపీఎం, సెంట్రల్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రజలు పథకాలపై అవగాహన కలిగి ఉంటేనే ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడుతున్న ఏపీఎం నాగేశ్వర్‌రావు

## ఘనంగా అమ్మ, నాన్న, గురువు పద్యార్చన

పాలకుర్తి, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తానా 100 దేశాల్లో ఉన్న వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందేవిశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా, అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 10లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే పాలకుర్తి ప్రభుత్వ స్కూల్‌లో చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి సామూహిక గానం చేశారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులకు పెద్దలపై గౌరవం పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు ఒరుగంటి రమేశ్, తిరునగరి లవకుశ, నరసింహమూర్తి, అశోక్, బలరాం, రవి, ఉప్పలయ్య, సంజీవ్, దీపా, భవాని, శోభ పాల్గొన్నారు.


పాలకుర్తి పాఠశాలలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన చేస్తున్న విద్యార్థులు

## జాతీయ స్థాయి శిక్షణలో చంద్రశేఖర్

బచ్చన్నపేట, డిసెంబర్ 18: దేశ్‌పాండే ఫౌండేషన్, ఆనంద్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి శిక్షణలో తెలంగాణ నుంచి ధరావత్ చంద్రశేఖర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించిన సంస్థలకు, ఇందులో పాల్గొన్న ప్రతినిధులకు, భాగస్వాములైన వారికి దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు దినేశ్‌రెడ్డి, మహేశ్, సతీష్, ప్రేమ్, నరేశ్, వెంకటేశ్వర్లు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ శిక్షణలో ఫెసిలిటేషన్ స్కిల్‌పై అవగాహన కల్పించారు.

# సమస్యలను త్వరగా పరిష్కరించండి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్ష



జనగామ, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): నియోజకవర్గ సమస్యలను త్వరగా పరిష్కరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యతోపాటు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినతులు, సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన పల్లాకు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు సాగునీరు, తాగునీరు, రోడ్ల మరమ్మతులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, జిల్లా ప్రజాపరిషత్, పురపాలక సంఘం, ధాన్యం కొనుగోళ్లు, పరిశ్రమలు, ఎస్సీ, బీసీ వెల్ఫేర్ శాఖలపై, పౌర సరఫరాలు, తదితర శాఖలపై అధికారులతో సమీక్షించారు. వెంటనే సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు. జనగామ ఎంపీపీ కళింగరాజు, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, సీపీవో ఇస్మాయిల్, డీఎస్‌ఓ రోజారాణి, డీడబ్ల్యూ జయంతి ఉన్నారు.


సమీక్షలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కలెక్టర్ శివలింగయ్య

# ఎలక్షన్ విధుల డబ్బులు చెల్లించాలి

### కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్‌గా విధులు నిర్వర్తించిన 76 మందికి వెంటనే డబ్బులు చెల్లించాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోలి చంద్రప్రకాశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో 26 మంది, స్టేషన్ ఘన్‌పూర్ 23, పాలకుర్తి నియోజకవర్గంలో 27మందికి రోజుకు రూ.2500 చొప్పున డబ్బులు చెల్లించాలని కోరారు. ధర్నాలో ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ సుమారు 40 మంది పాల్గొన్నారు.

## 23న జడ్పీ సర్వసభ్య సమావేశం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం ఈనెల 23 శనివారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కే అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని సీఈవో అనిల్ కుమార్ సూచించారు.

## బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తరలిరావాలి

లింగాలఘనపురం, డిసెంబర్ 18: నిడిగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగే సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, గవ్వల మల్లేశం తెలిపారు. మండల కేంద్రంలో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, అనుబంధ సంఘాల బాధ్యులు హాజరుకావాలని సూచించారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న, నాయకులు కేమిడి యాదగిరి, కేమిడి భిక్షపతి, కేమిడి కవితా వెంకటేశ్, మల్ల శ్రీశైలం, వేముల శ్రీనివాస్, లింగాల వెంకటేశ్, గట్టగల్ల శ్రీహరి బాల్నె సత్యనారాయణ పాల్గొన్నారు.

# ‘పల్లా’ను సన్మానించిన బీఆర్‌ఎస్ నాయకులు


ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న నర్మెట బీఆర్‌ఎస్ నాయకులు

నర్మెట, డిసెంబర్ 18: జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సోమవారం జనగామలోని ఆయన ఇంటి వద్ద బీఆర్‌ఎస్ మండల నాయకులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కలిసిన వారిలో ఎంపీపీ తేజావత్ గోవర్దన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామిని శివరాజ్, సర్పంచ్‌లు, నాయకులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, నర్ర వెంకటరమణారెడ్డి, నీరటి సుధాకర్, పగడాల నర్సయ్య, బి.రవి, లకావత్ కిరణ్, మంగనీయ, భూక్య లాలు, కొర్ర రాజ్‌కుమార్, వస్పరి రాజు ఉన్నారు.


అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీజీవోస్ ప్రతినిధులు

## అదనపు కలెక్టర్‌ను కలిసిన టీజీవోస్, టీఎన్జీవోస్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పర్మార్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోస్), తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవోస్) ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోర్నేలియస్ చంద్రమోహన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా షరీఫ్, పెండెల శ్రీనివాస్, జిల్లా అధికారులు రోజారాణి, కేతిరెడ్డి లత, జయంతి, చౌడేశ్వరి, డాక్టర్ చేపూరి ప్రశాంత్, డాక్టర్ అశోక్ కుమార్, రమేశ్, డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్, రాజనర్సయ్య, హఫీజ్, సంపత్, రాంనర్సయ్య, నరేశ్, శ్రీధర్‌బాబు, నాగార్జున, మధు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై బీఎల్వోలకు శిక్షణ


బీఎల్వోలకు శిక్షణనిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: నూతన ఓటరు జాబితా సవరణపై జనగామ పట్టణ కేంద్రంలోని పోలింగ్‌బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వో) సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు రామరాజు, సురేందర్‌రెడ్డి బీఎల్వోల యాప్‌తోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్వోలదే కీలకపాత్ర అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఉపయోగించే ఫారమ్ 6, 6 ఏ, 6 బీలను ఏయే సందర్భాల్లో వినియోగించాలో వివరించారు. ఓటర్ల తొలగింపు, ఇతర ఓటర్లపై అభ్యంతరం కోసం ఫారమ్ 7, ఓటరు బదిలీ, దివ్యాంగుల మార్కింగ్ కోసం ఫారమ్ 8ని ఎలా వాడాలో చర్చించారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల జనవరి 5వ తేదీలోగా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల నాయబ్ తహసీల్దార్ శేఖర్‌రెడ్డి, వంశీ, మండల ఆర్‌ఐలు, బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.